సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 12 । మే । 2025



దేవుడి పేరిట దోపిడీ

బొనటూరులో దేవుడి పేరిట దోపిడీ జరుగుతోంది. 8 నెలలుగా తంతు సాగుతోంది.

- 8లో



ఎన్నేళ్లకు పెద్దపండగ వచ్చె..

మెట్టవలసలో 80 ఏళ్ల తర్వాత గ్రామదేవత పండగలు జరుగుతున్నాయి. 13తో ముగియనున్నాయి.

- 8లో

సచివాలయ విద్యాసహాయకుల ఉద్యోగుల సంఘం ఎన్నిక

అరసవల్లి: జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న విద్యా సహాయకుల ఉద్యోగుల జిల్లా సంఘం కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బడే నుసాన్న, కార్యదర్శిగా దున్న వేణుగోపాలరావు, సహాయక అధ్యక్షునిగా జి.రాజశేఖరం, కోశాధికారిగా కె.జగపతిబాబు, జిల్లా ఉపాధ్యక్షునిగా కె.సంధ్య తదితరులను ఎన్నుకున్నారు. ఈ మేరకు కొత్త కార్యవర్గానికి జిల్లా సంఘ గౌరవాధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు.

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే డయల్ 1100కు నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకూర్మనాథాలయంలో 'సదస్యం'



పండిత సత్కారం జరుగుతున్న దృశ్యం

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సదస్యం జరిగింది. ఆస్థాన మంటపంలో ప్రత్యేక ఆసనంపై 'చక్ర పెరుమాళ్'ను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు, వైదికులు వివిధ పురాణాలను స్వామికి విన్నవించారు. ఆలయ అర్చకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.నరసింహనాయుడు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, దాసుబాబు, మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులుపాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : దేశ సరిహద్దులో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య కూడళ్లలోను, ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లలో ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, నియంత్రణ, పేలుడు పదార్థాల గుర్తింపు, సంఘ విద్రోహక శక్తుల అడ్డుకట్ట, కొత్త, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు పూర్తి నిఘా పెట్టారు.

● నిశీధిలో..నీటి పాట్లు





చిత్రంలో మహిళలు మంచినీరు పట్టుకుంటున్న సమయం వేకువజాము అనుకునేరు. అచ్చంగా అర్ధరాత్రి. తేలుకుంచి దాహమో..రామచంద్రా అని అరుస్తోంది. ఊరిలో విద్యుత్ స్తంభాల కోసం తవ్వకాలు జరపడంతో తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయి మంచినీటి సరఫరా ఆగిపోయింది. ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇచ్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ప్రయత్నిస్తే.. స్థానిక కూటమి నాయకుడు ఒకరు వీల్లేదంటూ అడ్డుకున్నారు. దీంతో నాలుగు రోజులుగా తాగు నీరు లేక తేలుకుంచి వాసులు అల్లాడుతున్నారు. స్థానిక మెయిన్ రోడ్డు పక్కన ఉన్న పైప్ ద్వారా వచ్చే మంచినీటి కోసం ఇలా అర్ధరాత్రి సమయంలో పడిగాపులు కాస్తున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

● ఆదిత్యా.. కనికరం చూపవయ్యా

ఆదిత్యుడి భక్తులు ఎండలకు తాళలేకపోయారు. ఆదివారం నాడు అరసవల్లి ఆదిత్య క్షేత్రానికి ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. టెంట్లు, షామియానాలు ఉన్నా భక్తులకు అవి సరిపోలేదు. దీంతో ఎర్రటి ఎండలో భక్తులంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. క్యూలో ఉన్న భక్తులు కూడా ఉక్కబోతతో అల్లాడిపోయారు. ఓ కుటుంబం ఇలా ఎండకు తాళలేక టెంటు నీడన తల దాచుకుంది.

– అరసవల్లి



● రజత కవచ ధర గోవిందా..





జిల్లా కేంద్రంలోని నారాయణ కొండపై వెలసి ఉన్న వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, ఈఓ శ్యామలరావుల పర్యవేక్షణలో గరుడ వాహనంపై శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరింపచేసి ఆశీనులను చేశారు. ఉదయం స్వామి రజత కవచ ధారణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

– శ్రీకాకుళం కల్చరల్

● 56 కేంద్రాలు..

21,572 మంది విద్యార్థులు

- నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టిన యంత్రాంగం



శ్రీకాకుళంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఫర్నిచర్‌పై హాల్‌టిక్కెట్ల నంబర్లను వేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో సోమవారం నుంచి మొదలుకానున్న ఈ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాలకు మెటీరియల్స్‌ను చేరవేశారు. మార్చిలో రాసిన పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులతోపాటు ప్రథమ సంవత్సరంలో మార్కులు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) మరికొంత మంది విద్యార్థులు ఈ పరీక్షలను రాస్తున్న విషయం తెలిసిందే. మొత్తంమీద ఈ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల నుంచి 21,572 మంది విద్యార్థులు ఫీజులను చెల్లించారు. పరీక్షల కోసం 56 కేంద్రాలను కేటాయించారు. వీటిలో ప్రభుత్వ యాజమాన్య కళాశాలలే అధికంగా ఉన్నాయి.

అధికారులు, సిబ్బంది నియామకం పూర్తి..

పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించారు. మూడు ఫ్లయింగ్, 6 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్/డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్, ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించి పలు అంశాలపై



దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నీచర్‌ను సిద్ధం చేశారు. సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేసి అమర్చారు.

రెండు సెషన్స్‌లలో పరీక్షలు..

సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు అర్ధగంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిర్ణీత సమయానికి హాజరు కాకుంటే.. పరీక్ష కేంద్రంలోపలకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేందుకు, పరీక్ష కేంద్రాల వద్ద పహారా కాసేందుకు పోలీసు సిబ్బందిని నియమించారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించారు. ఇన్విజిలేటర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 10 ప్రత్యేక రూట్లలో ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు.

ఎండల నేపథ్యంలో సౌకర్యాలు..



మండే ఎండల నేపథ్యంలో ఇంటర్ బోర్డు అధికారులు, కలెక్టర్ సూచనల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అన్ని కేంద్రాల్లో తాగు నీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లతో మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాం. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లను బీఐఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

– ప్రగడ దుర్గారావు, ఆర్‌ఐఓ/డీఈసీ కమిటీ కన్వీనర్

కులమతాల అడ్డుగోడలు పోవాలి

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



సుద్దాల అశోక్‌తేజను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: కులమతాల అడ్డుగోడలు పోవాలని, దాని వల్ల ఎదగలేకపోతున్నామని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అభిప్రాయపడ్డారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీశూద్రగంగ కావ్యగాన కార్యక్రమం శ్రీకాకుళ సాహితీ, సాహితీ స్రవంతి సంయుక్త నిర్వహణలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా ఇంట్లో రంగభూమి అనే ప్రేమ్‌చంద్ నవల చదివిన తర్వాత దానికి బానిసనయ్యాను. అందులోని పాత్రలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 30 ఏళ్ల కిందటే నాకు కులమతాల కోసం తెలిసి ఉంటే నా పేరును సుద్దాల అశోక్ శూద్ర తేజ అని పెట్టుకునేవాడిని' అని అన్నారు. పేరు పక్కన శూద్ర అని పెట్టుకుంటే కులమతాల అడ్డుగోడలు తొలగిపోతాయన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కవిని, కావ్య పరిచయాన్ని శ్రీకాకుళ సాహితీ ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శ్రీకాకుళం సాహిత్య చరిత్రలో ఇది ఒక సువర్ణ ఘట్టమని తెలిపారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ శూద్రగంగ కావ్యగానం చేశారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్, కంచరాన భుజంగరావు, చీకటి దివాకర్, కారసాల శ్రీనివాసరావు, కల్లేపల్లి రామ్‌గోపాల్, ఎస్.రుద్రమరాణి, బాడాన శ్యామలరావు పాల్గొన్నారు.

కూటమిది కక్షపూరిత పాలన

- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- మహిళలపై అనుచిత ప్రవర్తన
- ధర్నాలో వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



వైఎస్సార్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కక్షపూరిత పాలన సాగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడుదల రజినిపై సీఐ సుబ్బనాయుడు అనుచిత ప్రవర్తన, గుంటూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత మహిళ, ఎంపీటీసీ కల్పన పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా.. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని వైఎస్సార్ కూడలి వద్ద పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఊలాల భారతి దివ్య, పార్టీ నాయకులు ముంజేటి కృష్ణమూర్తిలు మాట్లాడుతూ చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడుదల రజినిపై సీఐ సుబ్బనాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. మాజీ మంత్రి, మహిళ అని కూడా చూడకుండా సీఐ రజినిని పక్కకు తోసేయడం పోలీసుల దుశ్చర్యకు నిదర్శనమన్నారు. మహిళలపై కూటమి ప్రభుత్వానికి, పోలీసులకు ఎంతటి గౌరవం ఉందో ఈ సంఘటన ద్వారా స్పష్టంగా తెలుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కల్పన ఒక దళిత మహిళ అని చూడకుండా అర్ధరాత్రి ఆమెను అరెస్ట్ చేసి నైటీలోనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారని, ఇది అత్యంత దారుణమన్నారు.

రాష్ట్రంలోని రైతులకు, నిరుద్యోగులకు, మహిళలకు కూటమి ప్రభుత్వం, నాయకులు హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. తమ తప్పులు కప్పి పుచ్చుకునేందుకు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. శ్రీకాకుళం రూరల్ జెడ్పీటీసీ రుప్ప దివ్య, వైఎస్సార్‌సీపీ దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదని గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నాయకులు అంబటి శ్రీనివాసరావు, యజ్జల గురుమూర్తి, మూకళ్ల తాతబాబు, గుంట జ్యోతి, సీపాన రామారావు, రావాడ జోగినాయుడు, ఎస్.వెంకటరావు, సతివాడ రామినాయుడు, పి.రాజశేఖర్, అలపాన త్రినాథ రెడ్డి, ఎన్.కృష్ణ, తవిటినాయుడు, ఎ.రమేష్, సీహెచ్ గడ్డెయ్య తదితరులు ఉన్నారు.

ఎత్తిపోతలు.. ఉత్తి మాటలు



హిరమండలం వద్ద నత్తనడకన సాగుతున్న ఎత్తిపోతల పథకం పనులు



- గొట్టా బ్యారేజీ ఎత్తిపోతల పథకం పనుల్లో చిత్తశుద్ధి కరువు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదిలో 33 శాతం పూర్తి
- కూటమి ఏడాది పాలనలో కేవలం 7 శాతమే
- పాలకుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

హిరమండలం:

పాలకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ముఖ్యంగా జిల్లాలోని కీలక ప్రాజెక్టు గొట్టా బ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకం పనుల విషయంలో ఈ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో ఏడాదిలో 33 శాతం పనులు జరిగితే.. కూటమి ప్రభుత్వం ఏడు శాతానికి మించి పనులు చేయలేకపోయింది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న శ్రీకాకుళం జిల్లాకు ఒక సాగునీటి ప్రాజెక్టు అవసరమని 2003 పాదయాత్రలో వైఎస్ రాజశేఖర రెడ్డి మొదటగా గుర్తించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జలయజ్ఞంలో భాగంగా వంశధార రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ రిజర్వాయర్ నిండాలంటే నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టాలి. కానీ దీనికి ఒడిశా అభ్యంతరాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఒడిశాతో జల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూనే.. ప్రత్యామ్నాయంగా 2022 సెప్టెంబరు 14న గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికిగాను రూ.176.35 కోట్లు మంజూరు చేశారు. అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థకు టెండర్లు కేటాయించారు. దీంతో శరవేగంగా పనులు జరిగాయి. 2024 ఎన్నికల నాటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా 33 శాతం పనులు పూర్తిచేసింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో కేవలం 7 శాతం పనులను మాత్రమే పూర్తిచేసింది. ఇంకా ప్రధాన విభాగాలకు సంబంధించి పనులు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. ఇప్పట్లో పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు.

వాస్తవంగా భామిని మండలం నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం పూర్తయితే రిజర్వాయర్‌లో నీటి స్థిరీకరణకు ఎలాంటి ఢోకా ఉండదు. కానీ ఒడిశా ప్రభుత్వంతో వివాదం కారణంగా ఎడతెగని జాప్యం జరుగుతోంది. దీంతో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక ఆలోచనకు వచ్చింది. ఒడిశాతో ఒకవైపు జలాల సమస్యకు పరిష్కార మార్గం చూపుతూనే.. గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా 12 టీఎంసీలను రిజర్వాయర్‌లోకి తరలించాలని ఆలోచన చేశారు. 2022 సెప్టెంబరు 14న రూ.176.35 కోట్లు మంజూరు చేశారు. 2023 ఆగస్టులో హైదరాబాద్‌కు చెందిన సంస్థ టెండర్లు దక్కించుకొని పనులు ప్రారంభించింది. అక్కడకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకూ రూ.140.07 కోట్లతో 33 శాతం పనులు పూర్తిచేసింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు మందగించాయి. చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ ప్రభావం పనులపై పడింది. కూటమి ప్రభుత్వం రూ.182 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పినా.. పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. ఈ ఏడాది కూటమి పాలనలో ఎత్తిపోతల పథకానికి సంబంధించి పనులు 7 శాతం మాత్రమే పూర్తయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కానరాని పురోగతి..

ప్రస్తుతం ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పనుల తీరు చూస్తుంటే ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే పనులు కొలిక్కి వచ్చేవన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గొట్టా బ్యారేజీ ఆర్‌ఎంసీ హెడ్ రెగ్యులేటర్ నుంచి 2.4 కిలోమీటర్ల పొడవున కాలువ వెడల్పు ఐదు మీటర్ల చొప్పున పెంచాల్సి ఉంటుంది. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్ ఏర్పాటుచేయాల్సి ఉంది. పంపుహౌస్ పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఏపీ ట్రాన్స్‌కోకు రూ.9.18 కోట్ల బకాయిల చెల్లించాల్సి ఉంది. 3.2 మీటర్ల 110 పైపులను తయారుచేశారు. వీటిని అమర్చాల్సి ఉంది. ఈ ఎత్తిపోతల పథకానికి సంబంధించి జలాశయం గట్టుపై డెలివరీ సిస్టమ్స్‌కు ఇంతవరకూ అనుమతి రాలేదు. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉంటే కూటమి పాలకులు ఎత్తిపోతల పథకం విషయంలో ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు ఎన్నో..

ఇక్కడ ఎత్తిపోతల పథకం పూర్తయితే కానీ జలాశయం లక్ష్యం నెరవేరదు. కేవలం వర్షాకాలంలో అతిగా వచ్చే వరదలు సైడ్ వీయర్ ద్వారా రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. అంతే తప్ప వంశధారలో సాధారణ ప్రవాహం ఉన్నప్పుడు రిజర్వాయర్‌లోకి నీరు చేరే అవకాశమే లేదు. అందుకే అత్యవసరంగా ఇక్కడ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాల్సి ఉంది. రిజర్వాయర్‌లోకి 12 టీఎంసీల నీటిని నిల్వ ఉంచవచ్చు. అదే జరిగితే ఏడాది పొడవునా శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చు. వంశధార కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 2.11 లక్షల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందించవచ్చు. ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా ఇబ్బందులు లేకుండా చూడవచ్చు. నదుల అనుసంధానం, నారాయణపురం ఆనకట్ట ద్వారా మరో 25 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఉద్దానం ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి 1.12 టీఎంసీల తాగునీరు అందిచవ చ్చు. ఇన్ని ప్రయోజనాలున్న ఈ ఎత్తిపోతల పథకంపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం



కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం జిల్లా రైతులకు శాపంగా మారుతోంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా ప్రజల ఆకాంక్షను తీర్చేందుకు.. పుష్కలంగా సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం ఆలోచన చేశారు. వెనువెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదిలో 33 శాతం పనులు చేయిస్తే.. కూటమి ప్రభుత్వం ఏడాదిలో 7 శాతం పనులు మాత్రమే పూర్తిచేయగలిగింది. కూటమి ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

మాజీ మంత్రి రజినిపై పోలీసుల చర్య హేయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: కూటమి పాలనలో అంతా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, కోర్టులు ఎన్ని మొట్టికాయలు పెడుతున్నా పోలీసులు అత్యుత్సాహానికి పోయి ఇష్టానుసారం వ్యవహరించడం శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఒక కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న బీసీ నేత, మహిళా నాయకురాలు, మాజీ మంత్రి విడుదల రజినిపై చిలకలూరిపేట సీఐ సుబ్బనాయుడు ప్రవర్తన హేయమైన చర్య అని అన్నారు. ఒక మహిళపై ఇలా దురుసుగా ప్రవర్తించడం దారుణమని పేర్కొన్నారు. మాజీ మంత్రిని ఇలా పక్కను నెట్టడం, ఆమెపై దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. అలాగే గుంటూరు జిల్లా కంతేరులో కూడా ఎంపీటీసీ అయిన దళిత మహిళ కల్పనను రాత్రి 3 గంటలకు అరెస్టు చేయడం రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శనమన్నారు. ఈ అన్యాయాలపై పోరాటం చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రజలకు అండగా ఉంటుందన్నారు.

అమర వీరునికి ఘనంగా నివాళి



కాశీబుగ్గ: యుద్ధ భూమిలో దేశరక్షణ కోసం పోరాడి వీరమరణం పొందిన వీర సైనికుడు మురళీ నాయక్‌కు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డులో ఘనంగా నివాళులర్పించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్‌కు ఎదురుగా వీర సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూల మాలలు వేస్తూ, మాజీ సైనికుడు ఉప్పాడ వెంకటరమణ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

క్లుప్తంగా

శ్రీముఖలింగంలో భక్తుల సందడి



స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వైశాఖమాసం మొదటి ఆదివారం భక్తులు సందడి చేశారు. హిరమండలం పరిధి అంబావిల్లి త్రినాథ స్వామికి మొదటి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు శ్రీముఖలింగం తండోపతండాలుగా వచ్చి పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా నలుమూలలతో పాటు పక్క రాష్ట్రాలైన వియనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తెలంగాణ, చత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు తరలి వచ్చారు. అర్చకులు గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వారాహి అమ్మవారికి కూడా కుంకుమ పూజలు చేశారు. మరికొందరు తమ కోర్కెలు తీరడంతో గోలెంలో బియ్యం వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీముఖలింగంలో నరసింహ జయంతి

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం ఆలయ పరిధి నరసింహ స్వామి ఆలయంలో వైశాఖ మాసం ఆదివారం ఘనంగా నరసింహ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతి అయిన బెల్లం, పానకాలు నైవేద్యం సమర్పించి భక్తులు పంచిపెట్టి నట్లు అర్చకులు విశ్వనాథ్ దాస్, ప్రసాద్ పాడి తెలిపారు. అనంతరం స్వామివారికి హారతులిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలు



గాయాలపాలైన క్లీనర్ సదాశివం

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, హైవే పెట్రోలింగ్ ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీ ముందు వెళుతున్న లారీని బలంగా ఢీ కొట్టింది. దీంతో క్లీనర్ సదాశివం కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు అయిపోయింది. వెంటనే హైవే పోలీసులు అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కళకళలాడిన కాంప్లెక్స్



నాన్‌స్టాప్ క్యూలో బారులు తీరిన ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో కళకళలాడుతూ కనిపించింది. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ప్రయాణికుల తాకిడి మరింత అధికమైంది. తిరుగు ప్రయాణంలో కాంప్లెక్స్‌లో నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు టికెట్‌ల కోసం క్యూలో బారులు తీరుతూ కనిపించారు. నాన్‌స్టాప్ బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ అధికారులు త్వరితగతిన స్పందించి ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు నాన్‌స్టాప్ బస్సుల స్థానంలో పల్లెవెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడిపారు.

'బకాయి వేతనాలు చెల్లించండి'



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెల్లించాల్సిన మార్చి నెల బకాయి వేతనం రూ. 7,200 వెంటనే చెల్లించాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.నాగమణి, డి.ధనలక్ష్మి, జి.అమ రావతి డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో సీఐటీయూ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో మార్చి నెల పూర్తి వేతనం చెల్లించినా శ్రీకాకుళం జిల్లాలో జిల్లా అధికారుల జాప్యం వల్ల జీతం రాలేదని అన్నారు. ఆశాలకు రికార్డులు అవసరం లేదని మొబైల్ యాప్‌లో పని చేయాలని రాష్ట్ర అధికారులు ఆదేశాలిస్తే జిల్లాలో రికార్డు పని, ఆన్‌లైన్ పని రెండు రకాలు పనులు చేయిస్తూ పని భారం పెంచుతున్నారన్నారు. లేబర్ కోడ్లు రద్దు, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరుతూ కార్మిక సంఘాలు పిలుపుమేరకు మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను ఆశాలంతా జయప్రదం చేయాలని కోరారు.




మూగజీవాల విడిది

ఎండలు మండిపోతున్నాయి. మనుషులంటే గొడుగులు పట్టుకుని టోపీలు పెట్టుకుని ఎండ బారి నుంచి తప్పించుకుంటున్నారు. మూగజీవాలు మాత్రం ఇలా ప్రకృతి సాయంతో నీడను వెతుక్కుంటున్నాయి. మెళియాపుట్టి మండలంలోని బాణాపురం పంచాయతీ పరిధిలో గుమ్మడ గ్రామం సమీపంలో చెరువు ఉంది. ఒడ్డున కాస్త నీరు మధ్యలో కొన్ని చెట్లు ఉండడంతో అది మూగజీవాలకు విడిదిలా మారింది. మండుటెండలో పక్షులు, పశువులు ఆ చెరువులో సేద తీరుతున్నాయి. - మెళియాపుట్టి

● కుండ పోయి సీసా వచ్చె..



తాటి కల్లు కోసం గీత కార్మికులు కుండలు కడుతుంటారు. కానీ ఆ కాలం కూడా పోయినట్టుంది. కింతలిమిల్లు సమీపంలోని తాటి కల్లు కోసం చెట్టుకు సీసా కట్టారు. చెట్టుకు బిడ్డి, సీసా రెండూ కట్టి ఉన్నాయి. సీసాలు సైతం గీత కార్మికులు ఇలా వినియోగిస్తున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

దేవుడి పేరిట దోపిడీ

- పొనుటూరులో ఇసుక దందా
- ఒడిశాకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- వరద గట్టును సైతం తవ్వేసిన వైనం



పొనుటూరు గ్రామం సమీపంలోని వంశధార నుంచి ఒడిశా ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేస్తున్న కార్మికులు

కొత్తూరు:

దేవుడి పేరు చెప్పి మరీ అధికార పార్టీ నేతలు ఇసుక దోపిడీకి తెగబడుతున్నారు. ఉచిత ఇసుక పథకం ఆ నాలుగు గ్రామాల టీడీపీ నేతలకు దేవుడి వరంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆలయాలు నిర్మిస్తున్నామంటూ పొనుటూరు పంచాయతీ పరిధిలోని పాతపొనుటూరు, పొనుటూరు కాలనీ, కొత్తపొనుటూరు, బంకి గ్రామాలకు చెందిన కొంత మంది నేతలు ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది.

కొత్తూరు మండలంలోని పాత పొనుటూరుకు అనుకొని ఉన్న వంశధార నదిలో అక్రమ ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారు. ర్యాంపు నుంచి ఇసుక తీసుకెళ్లే ఆంధ్రా వాహనాల నుంచి రూ.200, ఒడిశా వాహనాల నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. అసలే అక్రమ ర్యాంపు. ఆపై అక్రమ వసూళ్లు కావడంతో స్థానికులు కూడా నిశ్చేష్టులవుతున్నారు. గత 8 నెలలుగా ఈ దందా సాగుతోంది. నాలుగు గ్రామాలకు చెందిన కొంత మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా రెవెన్యూ, మైన్స్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వీరికి అడ్డు అదుపు లేకుండా పోతోంది.

వాస్తవానికి ఆంధ్రా నుంచి ఇసుక ఒడిశాకు రవాణా చేయకూడదని నిబంధన ఉన్నా.. ఒడిశాకు చెందిన ట్రాక్టర్లతో పొనుటూరు నుంచి ఇసుక తీసుకెళ్తున్నారు. ఒడిశాకు తరలిస్తున్న ట్రాక్టర్ నుంచి రూ. 500ను దేవుడి పేరుతో గుంజుకుంటున్నారు. సాక్షాత్తు గ్రామ సచివాలయం పక్క నుంచే అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ఇదే పంచాయతీ పరిధి బంకి గ్రామం నుంచి నదిలో ఇసుక అక్రమ రవాణా కోసం పూర్తిగా వరద గట్టును తవ్వేశారు. నదికి వరదలు వస్తే వరద నీరంతా పంట పొలాల్లోకి, గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించే ప్రమాదం ఉంది. ఇంత జరుగుతున్నా వంశధార ఇంజినీరింగ్ అధికారులకు పట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారి ఆట కట్టించాలని, అక్రమ ఇసుక రవాణా ఆపాలని కోరుతున్నారు.



పొనుటూరు గ్రామం వద్ద వంశధారలో ఇసుక లోడింగ్ కోసం ఉన్న ఒడిశాకు చెందిన ట్రాక్టర్లు

తగిన చర్యలు తీసుకుంటాను



పొనుటూరు వంశధారలో నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే చర్యలు తీసుకుంటాను. ఒడిశాకు ఇసుక తరలించకూడదు. దేవుడి పేరుతో అక్రమ వసూళ్లు చేయడం నేరం.

- కె.బాలకృష్ణ, తహసీల్దార్ కొత్తూరు

దళిత విద్యార్థులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

కాశీబుగ్గ: పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం జిల్లా దళిత సంఘాల సంయుక్త మండలి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో బాలికల/బాలుర గురుకుల పాఠశాలలు 1983లో స్థాపించారని సుమారుగా 30 ఏళ్ల నుంచి అవే భవనాలు ఉండడం, కొత్త భవనాలు అరకొరగా ఉండడం, మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని అన్నారు. గత 15 ఏళ్లుగా గురుకులాల్లో దళిత విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయని, అందుకు గల కారణాలు విశ్లేషించాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేకమైన కమిటీతో అధ్యయనం చేయించాలని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏ రకమైన సమస్యలు లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, బెలమర ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి మద్దిల వినోద్, జిల్లా కార్యదర్శి యడ్ల గోపి, ధర్మారావు, కరుణాకర్, బి.దుర్యోధన, ఎస్‌జీటీ నాయకులు బోనెల గోపాల్, చల్లా రామారావు, గెజిటెడ్ అధికారుల సంఘం గొజ్జ నాగరాజు, ఆదివాసీ సంఘం నాయకులు వరహాల భాగ్యరావు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇప్పిలి చంద్రశేఖర్, పిలక శ్రీను, ఉదయపురం శ్రీనివాసరావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అఖిలభారత సమ్మె విజయవంతం చేయండి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మే 20న అఖిలభారత సమ్మె విజయవంతం చేయాలని కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు కోరారు. 'లేబర్ కోడ్లు- కార్మిక హక్కులపై దాడి' అనే అంశంపై మే 20 సమ్మె జయప్రదంకై కార్మిక,ఉద్యోగ సంఘాలు ఆధ్వర్యంలో జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరణ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు సవరించాల్సిన కనీస వేతనాలు గత 20 ఏళ్లుగా సవరించలేదని, కార్మికులు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారన్నారు.

మరణించిన 22 రోజులకు..



పలాస మండలం ఖైజోల చేరుకున్న దామోదర్ మృతదేహం



దామోదర్ (ఫైల్)

కాశీబుగ్గ: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ఊహించని రీతిలో మరణించిన యువకుడి మృతదేహం ఇరవై రెండు రోజుల అనంతరం స్వదేశానికి చేరుకుంది. పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామానికి చెందిన బుడత దామోదర (33) గత నెల 21వ తేదీ సోమవారం మరణించినట్లు ఇక్కడకు సమాచారం వచ్చింది. పోలాండ్ దేశంలో వెల్డర్‌గా పనిచేసేందుకు వెళ్లి ఓ పార్కులో ఊయల వద్ద మరణించడం సంచలనంగా మారింది. దామోదర్‌కు అమ్మ పున్నమ్మ, పెరాలిసిస్‌తో బాధపడుతున్న తండ్రి లక్ష్మీనారాయణ, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దివ్యాంగుడైన అన్నయ్య, అతని భార్య పిల్లలతో కలిసి ఉమ్మడిగా జీవిస్తున్నారు. వారందరి కీ దామోదర్ మాత్రమే ఆధారం. కుటుంబం కోసమే ఆయన పోలాండ్ వెళ్లాడు. ఇంటి కోసం అంతదూరం వెళ్లి తిరిగి విగతజీవిగా రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అయన చనిపోయిన ఘటనపై 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. అయితే అక్కడ నిబంధనల ప్రకారం ప్రక్రియలు అన్నీ పూర్తయ్యి మృతదేహం స్వగ్రామానికి చేరేందుకు 22 రోజులు పట్టింది.

ఆదివారం అంత్యక్రియలు

దామోదర్ మృతదేహానికి స్వగ్రామం ఖైజోల గ్రామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలాండ్ తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్ర బాను, చంద్ర అల్లూరి, రమేష్‌లు కష్టపడగా ఇండియన్ ఎంబసీ ఎంతో సహకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామానికి చెందిన సీపాన రవి (48) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న ఈయనకి మద్యం అలవాటు ఉంది. దీంతో తరచూ ఇంటిలో గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో క్షణికావేశంలో శనివారం పురుగుల మందు తాగేశారు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆయనను స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ముగిసిన మాక్ డీఎస్సీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎర్రన్న విద్యా సంకల్పం పేరిట డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహించిన మాక్ డీఎస్సీ ముగిసింది. ఆదివారం జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో ఈ రెండు కేంద్రాల్లో జరిగిన ఈ మాక్ టెస్టుకు 300 మంది అభ్యర్థులు హాజరైనట్టు స్థానిక ఎంపీ కార్యాలయ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీకాకుళం యువతకు, వారిలోని ప్రతిభను ముందుగా తెలుసుకునేందుకు ఎర్రన్న విద్యా సంకల్పం పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు సందేశాన్ని పంపించినట్టు వెల్లడించారు.


నేను కుందువానిపేట..
వింటారా నా మాట



ప్రియమైన పర్యాటకులకు..
మీ కుందువానిపేట సముద్ర తీరం..
ఆశీర్వదించి రాయు విన్నపం..
మీకు గుర్తుందో లేదో..
ఒకప్పుడు మీలో చాలా మంది నా ఒడిలో
ఆడుకునేవారు.
పొద్దు పోయే వరకు ఇక్కడే ముచ్చట్లాడుకునేవారు.
ఈ తీరాన ఉండే చిన్ని పాకల్లో చిరుతిళ్లు కొనుక్కుని
ఇంటిల్లిపాదీ ఆనందించేవారు..
మీ ముఖాల్లో వెల్లివిరిసే సంతోషం చూసి
నాకూ ముచ్చటేసేది..
కానీ ఏ దిష్టి తగిలిందో..
ఇప్పుడు నా వద్దకు రావడమే మానేశారు..
ఒక ఆదివారం కాకపోతే మరో వారమైనా వస్తారని
ఎదురు చూస్తున్నాను..
కానీ ఎవరూ రావడం లేదు..
పోనీలే.. కార్తీకంలో వస్తారు అనుకునేదాన్ని..
కానీ నా అంచనా తప్పైపోయింది..
ఒకప్పుడు కళకళలాడిన ఈ పాకలు ఇప్పుడు
కూలిపోయాయి..
స్వచ్ఛమైన నా ఇసుక తిన్నెల మధ్య
ఏవేవో సీసా ముక్కలు గుచ్చుకుంటున్నాయి..
ఒకప్పుడు రాత్రి 8 గంటల వరకు నా ఒడిలో
చాలా మంది సేదతీరేవారు..
కానీ ఇప్పుడు రాత్రయితే చాలు ఇటుగా
రావడానికే చాలా మంది
భయపడుతున్నారు..
విద్యుత్ బల్బులన్నీ పాడైపోయాయి..
అనాదిగా అందాలు పంచిన ఈ ప్రదేశం..
ఇప్పుడు అందవిహీనమవుతోంది..
ఇది నేను తట్టుకోలేకపోతున్నా..
నాకు మళ్లీ వెనకటి రోజులు కావాలి..
పిల్లలంతా నా ఒడిలో ఆడుకోవాలి..
మీరంతా ఉదయాస్తమయాలు ఇక్కడి నుంచి మళ్లీ
ఆస్వాదించాలి..
ఆ పాకలన్నీ మళ్లీ కళకళలాడాలి..
సీసా ముక్కలు కనిపించని ఇసుక తిన్నెలు మిమ్మల్ని
స్వాగతించాలి.
నా అలల ఘోషనే నా విన్నపంలా భావించండి..
నా కెరటాలు మీ కోసమే వస్తున్నాయని
తెలుసుకోండి..
నా విన్నపాన్ని మన్నిస్తారని భావిస్తూ..


మీ
కుందువానిపేట సముద్ర తీరం

- శ్రీకాకుళం రూరల్



ఎన్నేళ్లకు పెద్ద పండగ వచ్చె..

- మెట్టవలసలో ఎట్టకేలకు గ్రామదేవత పండుగలు
- సిరిమాను, ఘటాలు లేకుండా ఉత్సవాల నిర్వహణ



మెట్టవలస కొండ



పూజలు చేస్తున్న స్థానికులు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో ఎట్టకేలకు గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయం చేశారు. గ్రామంలో 650 ఇళ్లు ఉన్నాయి. అంతా కలిసికట్టుగా పండుగ నిర్వహించేందుకు తీర్మానించారు.

80 ఏళ్ల తర్వాత..

గ్రామంలో ఈ ఉత్సవాలు జరిగి 80 ఏళ్లయ్యాయి. అప్పటి నుంచి ఉత్సవాలు జరగనేలేదు. మళ్లీ ఆ నాటికి ఉత్సవం నిర్వహిస్తుండడంతో ఊరు ఊరంతా సంబరపడుతోంది. దాదాపు రూ.7కోట్ల వ్యయంతో జాతర నిర్వహిస్తున్నారు. అయితే సిరిమాను గానీ, ఘటాలు గానీ లేకుండా పండుగ జరిగేలా ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నా చిన్నప్పుడు జరిగింది..



నాకు 85 ఏళ్లు. నా చిన్నప్పుడు మా ఊరిలో గ్రామ దేవత పండగ చేశారు. నాకు తెలిసీతెలియని వయసులో జరిగింది. ఇప్పుడు మళ్లీ మా గ్రామస్తులంతా కలిసి గ్రామదేవత పండగను నిర్వహిస్తున్నాం.

- దకర లక్ష్మంనాయుడు, మెట్టవలస

80 ఏళ్లవుతోంది..



నాకు 90 ఏళ్లు. నేను 5వ తరగతి చదువుతున్నప్పుడు మా గ్రామంలో తాతలు, పెద్దలు గ్రామ దేవత పండగ చేశారు. మా ఊరిలో మొదటి ఉద్యోగం చేసిన వాడిని నేనే. ఈ వయసులో మళ్లీ గ్రామదేవత పండగ చూసే అదృష్టం కలగడం ఆనందంగా ఉంది.

- యడ్ల ఆదినారాయణ, విశ్రాంతి పంచాయతీ అధికారి, మెట్టవలస

సచివాలయాలకు ఫైబర్ నెట్ కష్టాలు



చిన్నకిట్టాలపాడు సచివాలయంలో ఏర్పాటు చేసి ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సిస్టం

సారవకోట: మండలంలో సచివాలయాలకు ఫైబర్ నెట్ కష్టాలు తప్పడం లేదు. సచివాలయాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఏపీ ఫైబర్ నెట్ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఫైబర్ నెట్‌వర్క్ గత కొన్ని రోజులుగా రాకపోవడంతో సచివాలయాల్లో ఆన్‌లైన్ పనులు చేసేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాళ్ల వారి సొంత మొబైల్స్‌కు వైఫై ద్వారా కంప్యూటర్లకు కనెక్ట్ చేసుకుని ఆన్‌లైన్ వర్క్ చేయాల్సి వస్తుంది. అలాగే మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఈ ఏపీ ఫైబర్ నెట్ వినియోగిస్తుండటంతో వారు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నెట్‌వర్క్ వచ్చేటట్లు చూడాలని కోరుతున్నారు.